**కథ**

# ఒక్క క్షణం

**ఎందుకు పుట్టామో తెలియదు. ఎప్పుడు పోతామో తెలియదు అంటుంటారు. కానీ నా విషయంలో ఎప్పుడు పోతానో తెలుసు. ఖచ్చితంగా తెలుసు. అలా అని నాకేమి అతీతశక్తులు లేవు. కానీ నేను మరణించే రోజు తెలుసు.**

**అది మార్చి 24.**

ఆరోజు ఎందుకంటే ఆ రోజు పుట్టిన రోజు. ఆ రోజే ఆత్మ హత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. పుట్టినరోజు, పోయేరోజు ఒకే రోజు కావడం అరుదు కదా!

మార్చ్ 24 ఇంకా మూడు రోజులుంది.

ఈలోగా నా కథ మీకు చెప్పాలనుంది.

★ ★ ★

చాలామందిలాగే నేను కూడా నిరుపేద కుటుంబంలో పుట్టాను. అన్ని దేవుళ్ళ పేర్లు కలిపి పెద్ద పేరు పెట్టలేదు కాని 'భానుమూర్తి' అని పెట్టారు పేరు. నాన్న ఏం చేసే వాడో స్పష్టంగా గుర్తు లేదుకాని త్రాగి వచ్చి అమ్మని కొట్టే వాడని గుర్తుంది.

నాన్న చనిపోయాక అమ్మతోపాటు మేనమామ ఇంటికి వచ్చేసాను. మేనమామ మంచివాడు. నన్ను బాగా చూసుకొనేవాడు.

మేనమామకో కూతురుంది. మల్లి దాని పేరు. చాలా బాగుంటుంది. జాబిల్లిలా! రెండు జడలు, వేసుకున్నప్పుడు ఇంకా బాగుండేది!

మల్లికోసం చెరువులో దిగి ఎర్ర కలువలు తీసుకురావడం, చింతచిగురు కోసుకురావడం ఇలాంటి పనులు చెయ్యడం నాకిష్టం. టెన్త్‌క్లాస్‌వరకూ మేనమామ చదివించాడు. ఇక చదివించలేనన్నాడు. చదువు ఆపేసి హైదరాబాద్ వచ్చేసాను.

ఒక పుణ్యాత్ముడి దయవల్ల ఒక ఫ్యాక్టరీలో చేరాను. సైరన్ కూతకి వెళ్ళడం, మళ్ళీ సైరన్ కూతకి మళ్ళడం, మధ్యలో సైరన్‌కి లంచ్! సైరన్‌లు నా జీవితంలో భాగం అయ్యాయి.

సూపర్‌వైజర్ చెప్పినట్లు మెషీన్ దగ్గర అల్యూమినియం వస్తువులకు చిల్లులు చెయ్యడం ఇదే పని!

మొదట్లో పని ఇష్టం ఉండేది కాదు. కానీ ఆకలి తరముకుండా ఉండేది కాదు. పనిని, యంత్రాన్ని ప్రేమించాను. ప్రొడక్షన్ ఎక్కువ చెయ్యడంతో జీతం పెరిగింది! నాలుగేళ్ళు గడిచాయి ఫ్యాక్టరీలో!

మరో రెండేళ్ళ తర్వాత మల్లితో నా పెళ్ళయ్యింది!

మల్లి కాపురానికి వచ్చింది.

ఇంక జీవితంలో అన్నీ ఆనందాలే అనుకున్నా. హైదరాబాద్‌లో ఉన్నవన్నీ చూపించాను. సాలార్‌జంగ్ మ్యూజియం, బిర్లామందిర్, ట్యాంక్ బండ్, జూపార్క్..ఇలా.

రోజులు గడుస్తున్నా మల్లి ముఖంలో ఆనందం కనిపించడం లేదు. ఇంట్లో కలర్ టీవీ లేదని, బీరువా లేదని, ఖరీదైన చీరలు లేవని తనకు అన్నీ సమకూర్చలేని నేను చాతకాని వాడినని నిర్ధారించింది. చాలాసార్లు మల్లిమీద కోపం వచ్చింది. ఎంత నచ్చచెప్పినా వినేది కాదు. మల్లికోసం ఓవర్‌టైమ్ చేసేవాడిని. ఒకోరోజు మల్లి రాత్రంతా ఏడుస్తూ కూర్చునేది. ఎలా ఓదార్చాలో అర్థమయ్యేది కాదు.

"కొంచెం గారంగా పెరిగింది కదా! నువ్వే సర్దుకోవాలి" అన్న మేనమామ మాటలు గుర్తుకు వచ్చేవి. మల్లి కోరికలన్నిటికి జీతం సరిపోదు. ఇల్లు మారాక కొంచెం ఎక్కువ భాగం అద్దెకు పోతోంది!

ఆ సమయంలో మా ఇంటికి వచ్చాడు దూరపు బంధువు బలరాం. బలరాంది నా వయసే! బలరాం తరుచూ మా ఇంటికి వచ్చేవాడు. మల్లికి, నాకు బట్టలు తెచ్చాడు. వద్దన్నా విన్నాడు కాదు. బలరాం తరచూ రావడం నాకిష్టం ఉండేది కాదు. నేను లేనప్పుడు కూడా వస్తున్నాడని చుట్టుప్రక్కల వాళ్ళ వల్ల తెలిసింది. బలరాంతో గట్టిగా చెప్పాను. ఇంటికి రావద్దని.

★ ★ ★

ఆరోజు..

ఫ్యాక్టరీకి వెళ్ళగానే యజమాని పిలిచాడు. రేపటి నుండి పనిలోకి రావలసిన అవసరం లేదన్నాడు. ఎందుకన్నాను. ఫస్ట్‌షిఫ్ట్‌లో బెల్ట్ తెగిపోయినా ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయానని, సెకండ్ షిఫ్ట్ అతను పని చేస్తున్నప్పుడు బెల్ట్ పని చెయ్యకపోవడం వల్ల డిస్పాచ్ ఆగిపోయి లక్షల్లో నష్టం వచ్చిందని. నా నిర్లక్ష్యమే అందుకు కారణం అని చెప్పి ఉద్యోగంలో నుండి తీసేసారు.

అర్థమైంది!

ఎవరో కుట్రపన్ని రెండు షిఫ్ట్‌ల గ్యాప్‌లో బెల్ట్ పాడు చేసి తెలివిగా నా మీదకి తోసారు.

రేపటి నుండి ఉద్యోగం లేదు.

ఒక్కసారి కాళ్ళల్లో వణుకు బయల్దేరింది!

నా నిజాయితీని ఎవరూ నమ్మలేదు. ఆఖరిసారి నా మెషీన్‌ని చూసాను.

ఆరేళ్ళ అనుబంధం!

కాలో, చెయ్యో పోయినట్టుగా గిలగిల లాడాను.

మెషీన్ మౌనంగా వీడ్కోలు చెబుతున్నట్లనిపించింది.

కన్నీళ్ళతో బయటికి వచ్చాను.

★ ★ ★

మళ్ళీ బ్రతకడానికి ప్రయత్నాలు చేస్తున్నా, త్వరగా ఉద్యోగం దొరకలేదు. ఉన్న డబ్బు ఖర్చవుతోంది.

ఇంట్లో మల్లి సణుగుడు ఎక్కువ అవుతోంది!

బలరాం తన దగ్గర పని చెయ్యమన్నాడు.

'నాకిష్టం లేదు' పొమ్మన్నాను.

మూడు నెలల తర్వాత..

మరో పిడుగులాంటి వార్త!

ఊహించనిది!

మల్లి బలరాంతో లేచిపోయింది!

చుట్టూ జనం నాదే తప్పన్నారు. "మొగుడు సరిగ్గా ఉంటే అదెందుకు లేచిపోతుంది?" అంటూ గుసగుసలు.

"ఎప్పటి నుంచో వాళ్ళిద్దరి మధ్య ఉందిట"

ఛీ ఛీ వీళ్ళు మనుష్యులా? చెడు చర్చించుకోవడం అంటే ఎంత సరదా వీళ్ళకి!

కాలక్షేపానికో కబురులా తయారయ్యాను.

చాటుగా వాళ్ళ గొణుగుళ్ళు కీచురాళ్ళల్లా వినిపిస్తున్నాయి.

మామయ్య తన ఇంటికి నన్ను తీసుకు వచ్చినప్పటి నుండి మల్లిని ఇష్టపడ్డాను.

అటువంటి మల్లి నన్ను వదిలిపోతుందని అనుకోలేదు.

మల్లి లేకపోవడం కలో, నిజమో అర్థం కాలేదు!

నిజమేనని దండెం మీదనున్న మల్లి చీర చెబుతోంది!

ఎందుకిలా జరిగింది?

నాకే ఎందుకిలా జరిగింది?

అన్నీ ప్రశ్నలే!

నాన్నలాంటి మేనమామ, వెన్నలాంటి అమ్మ, అభిమానించిన మల్లి ఎవరూ లేరు!

ఒంటరివాణ్ణి!

రూమ్‌లోనే ఉంటున్నాను! బయటికి వెళ్ళడం లేదు. ఇంటి ఓనర్ వస్తాడని భయంగా ఉంది!

పది రోజుల తర్వాత ఉన్న కొద్ది డబ్బుని దొంగలు దోచుకుపోయారు!

ఎందుకో అదోరకం నవ్వు పెదవులపై మొలిచింది!

అయిపోయింది! అంతా అయిపోయింది!

జీవితంలో అంతాపోయింది!

కళ్ళు కన్నీళ్ళకి, కడుపు ఆకలికి అలవాటయ్యింది!

కష్టాలను సహించే ఓపిక తగ్గిపోతోంది!

ఎం. వీరేశ్వరరావు

* * *

మార్చి 22.

జీవితాన్ని అంతం చేసుకోవాలని!

దానితోపాటు ఆకలి, అవమానాన్ని అంతం చేసుకోవాలని!

నేను మళ్లి ఉన్న ఫోటోని విసిరేశాను.

కళ్ళు మూసుకోవడానికి ప్రయత్నించాను. నిద్ర ఎందుకు వస్తుంది?

* * *

మార్చి 24.

నా పుట్టినరోజు. చిన్నప్పుడు అమ్మ మార్కండేయుడంత ఆయుష్షు అనేది. నవ్వు వచ్చింది.

కొన్ని గంటలే!

ఇక నిర్ణయించుకోవాలి. నిద్రమాత్రలా? ఉరా? రైల్వేస్టేషనా?

రైల్వేస్టేషన్‌కి వెళ్ళాలని నిర్ణయించుకున్నాను.

సాయంత్రం స్టేషన్ దగ్గర జనం పలచగా ఉన్నారు.

పట్టాల మీద తల పెట్టాను.

నేను అనుకున్నట్లు రైలు రాలేదు.

ఎవరిదో చెయ్యి చల్లగా తగిలింది!

"ఎందుకు బాబు! ఆత్మహత్య చేసుకోవాలనుకున్నావు?"

"మీకెందుకు నా చావు నన్ను చావనివ్వండి"

"నీ కథ తెలుసుకుందామని!"

"తెలుసుకుని ఏం చేస్తారు?"

"సాయం చేద్దామని"

"సాయం!" నవ్వు వచ్చింది.

ఉద్యోగం పోయినప్పుడు, మల్లి వెళ్ళినప్పుడు, దొంగలు పడినప్పుడు ఈ మనుషులు ఎంత సాయం చేసారో తెలును!

"ఎందుకు నవ్వుతున్నావు?"

"ఏడ్వలేక!" అంటూ పట్టాల మీదకి వెళ్ళబోయాను.

ఆయన బలవంతంగా ఆపారు.

"ఒక్క పది నిమిషాలు నా మాట విను. మరణానికి, బ్రతుక్కి మధ్య వున్నది ఒక్క క్షణం. ఆ క్షణం ఎంతో విలువైనది. ఆ క్షణం సద్వినియోగం చేసుకుంటే మనిషి ఉన్నత శిఖరాలకు చేరతాడు లేదా పాతాళం జారిపోతాడు. మనిషి ఆస్తి, ఉద్యోగం కోల్పోయినట్లు ధైర్యాన్ని కోల్పోతే సర్వం కోల్పోయినట్లే! మనిషికి పిరికితనం చావు-ధైర్యమే జీవితం"

ఆయన మాటలు నన్ను ఆపుతున్నాయి!

"నిన్ను చూస్తే నా కొడుకుని చూస్తున్నట్లుంది"

ఆ మాటలకి చలించిపోయాను.

"మనిషిలో అంతర్గతంగా శక్తి ఉంటుంది! ఆ శక్తి వల్లే సమస్యలు సవాళ్ళుగా మారతాయి. మనుష్యుల మీద ఉన్న నమ్మకంకన్నా మనమీద మనకు నమ్మకం ముఖ్యం! ఈ రైల్వేస్టేషన్ దగ్గరే చిన్న టీ కొట్టుపెట్టుకుంటే ఎలా ఉంటుందంటావు?"

దగ్గర్లో టీ కొట్టు లేదు. ఈ ఆలోచన తనకెందుకు రాలేదు?

"డబ్బు మరి?"

"నేనిస్తా" అని ఆయన రెండు వేలు ఇచ్చారు.

"ముక్కు, ముఖం తెలియని నాకు.." ఆగిపోయాను.

"తిరిగి ఇవ్వక్కర్లేదు. తిరిగి పట్టాల దగ్గరకి వెళ్ళకుండా"

ఆనంద బాష్పాలతో ఆయనకు దండం పెట్టాను.

తిరిగి వస్తుంటే అడిగాను.

"నన్ను చూస్తే మీ అబ్బాయిని చూస్తున్నట్లుందన్నారు! మీ అబ్బాయి ఏం చేస్తున్నాడు!"

"వాడా పిరికిసన్నాసి! ఎంసెట్‌లో రాంక్ రాలేదని ఆత్మహత్య చేసుకున్నాడు" అన్నారాయన కళ్ళు ఒత్తుకుంటూ.

"బహుశా నేను కూడా కొంత కారణం అనుకుంటా.." అన్నారాయన!

ఒక్కక్షణంలో ఎంత మార్పు? క్షణం చాలు జీవితాలు మారడానికి.

మేమిద్దరం ఇంటి దారి పట్టాం! పైన చంద్రుడు వచ్చాడు... నా జీవితాన్ని వెన్నెలతో వెలిగించడానికి.

